వరంగల్ వార్త
వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు
గురువారం 7, డిసెంబర్ , 2023 16 పేజీలు

తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను

## సమర్ధవంతంగా అమలు చేయాలి



8లో.. జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్

# కర్షకుల కంటతడి



నీట మునిగిన మిరప, పత్తి, మొక్కజొన్న

కల్లాల్లోనే తడిచి ముద్దవుతున్న వరిధాన్యం

రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు

**ప్రభాతవార్తప్రతినిధి- హన్మకొండ:** ఆరుకాలం కష్టించి అప్పు సప్పు చేసి, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంట చేతికందే సమయానికి ప్రకృతి కన్నెర్ర చేయడం వరుణ దేవుడి ఉగ్రరూపంతో ప్రతి సంవత్సరం అన్నదాతల ఆశలు అడియాశలవుతున్నాయి. పక్కరాష్ట్రాలైన తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లో మిచంగ్ తుఫాన్ విలయతాండవం చేసిన విషయం విధీతమే. కాగా మిచంగ్ తుఫాన్ ఎఫెక్ట్ తెలంగాణ రాష్ట్రందే కాకుండా ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలో సైతం ప్రభావం చూపింది. తుఫాను ఎఫెక్ట్ వలన గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని ముసురు వర్షాల వలన ఓరుగల్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కర్షకులను కంటతడిపెడుతుంది.


2లో..

# ఇక సింగరేణి ఎన్నికలు

ఈనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలు

పోటీలో 13 గుర్తింపు పొందిన సంఘాల పోటీ

ఓటు హక్కును వినియోగించుకోనున్న 39748 మంది కార్మికులు



2లో...

**భూపాలపల్లి, ప్రభాతవార్త:** సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కోలాహలం మొదలైంది. ఈనెల 27న సింగరేణి పరిధిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించుటకు ఇప్పటికే హైకోర్టు ఆదేశాలు జారీ చేయగా కార్మిక మంత్రిత్వ శాఖ ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు చేపట్టింది. ఆరు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న సింగరేణి పరిశ్రమ 11 ఏరియాల్లో బొగ్గు తవ్వకం పనులను చేపడుతున్నది.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి




జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ

8లో..

జనగామ టౌన్, ప్రభాతవార్త: జనగామ జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 30వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ అన్నారు.

# రేవంత్ అను నేను..

ఎల్‌బి స్టేడియం వేదికగా సీఎంగా ప్రమాణం చేయనున్న రేవంత్

నాటి వై.ఎస్ బాటలోనే...

ఇక ప్రజా పాలన షురూ



2లో..

ప్రభాతవార్తప్రతినిధి- హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా నేడు ఎల్‌బి స్టేడియం వేదికగా అనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. నాటి వైఎస్ బాటలోనే రాష్ట్ర ప్రజల మధ్యనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని రేవంత్ ప్రకటించిన విషయం విధీతమే.

# కర్షకుల కంటతడి





(మొదటి పేజీ తరువాయి..)

గత 15 రోజులుగా జిల్లాలోని రైతులు, వరి పంటను కోసి అమ్మకం కోసం కళ్లాల్లోనే రాశులుగా పోశారు. కాగా కురుస్తున్న వర్షాలకు కళ్లాల్లోనే వరి ధాన్యం తడిచి ముద్దవడం మొలకలు ఎత్తుతుండటంతో ధాన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓరుగల్లు ఉమ్మడి జిల్లాలోని, ఏజెన్సీ ప్రాంతాలైన ములుగు, ఏటూరునాగారం, మహబూబాబాద్, నర్సంపేట, వరంగల్ హన్మకొండ ప్రాంతాలలో రైతులకు చేతికందిన మిరప, పత్తి, మొక్కజొన్న పంటలు ఈదురు గాలులకు అడ్డం పడి వర్షపు నీటిలో మునిగిపోవడంతో అన్నదాతలు పెట్టిన పెట్టుబడి మీద పడిపోతుందేమోనన్న ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మిర్చి పత్తి, ఏరుదామనే సమయంలోనే వర్షం పడుతుండటంతో చెట్లకు కాసిన మిర్చి, పత్తి, కురుస్తున్న వర్షాలకు నేలరాలడం పత్తి తడిచి ముద్దయి నల్లపడటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. గత రెండు సంవత్సరాలుగా భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలకు ఈ ఏడాదైనా ప్రకృతి సహకరిస్తుందని ఆశించిన రైతులకు మిచంగ్ తుఫాన్ ప్రభావం వలన భారీ నష్టమే జరిగే అవకాశం ఉందని తడిచన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం ఎలాంటి గిట్టుబాటు ధరలో కోత లేకుండా కొనుగోలు చేయాలని మిర్చి, పత్తి, మొక్కజొన్న దెబ్బతిన్న పంటలకు అధికారులు చొరవ చూపి పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని పూర్తి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని జిల్లా రైతాంగం ప్రభుత్వాన్ని కోరుతుంది.

## మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు ఏజెన్సీ కాకవికలం..!

**ఏజెన్సీలో నేలవాలిన వరిపంట**

**మరికొన్ని నీటమునిగిన వైనం**

**పత్తి, జనుము, చేతికి వచ్చింది నేల కూలింది**

**ఇంకా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు**

**వేలాది పెట్టుబడి పెట్టి నిండా మునిగిన రైతులు**

**మేడారం, ప్రభాతవార్త :**

బంగాళఖాతంలో లేసిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఏజెన్సీలో పంటలు కాకవికలం అవుతున్నాయి. వరి, పత్తి, జనుము, సాగు చేయగా, పంటలు చేతికి వచ్చాయి. కోతకు వచ్చిన పంటలు మిషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఇదే విధంగా పత్తి పంట కూడా తీసే దశకు వచ్చింది. జనుము పంట ఇప్పుడు పూతకు వచ్చింది. గాలి ప్రభావానికి నేల కూలింది. పనికి రాకుండా అయ్యింది. కొన్ని గ్రామాలలో వరి పంటను కోత కోశారు. వర్షం నీళ్లు నిల్వ చేరగా వరి మెదలు నీళ్లల్లో మునిగాయి. ఇంకా కొన్ని గ్రామాల్లో ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోశారు. బరకాలను కప్పి ఉంచారు. గోనె సంచులు రాకపోవడంతో బరకాల కిందనే ధాన్యం ఉంది. ఒక్కొక్క రైతు అర ఎకరం నుండి రెండు ఎకరాలు మరికొందరు ఐదు ఎకరాలు సాగు చేశారు. వర్షం కారణంగా పంటలు చేతికి వచ్చి నేల పాలు అయ్యాయి. కొన్ని గ్రామాలలో వరి అంతా నేల పాలు అయ్యింది. మండలం పరిధిలో కోతకు వచ్చిన వరి మెదల్లోకి వర్షం నీరు చేరింది. తడిసి ముద్ద అయ్యింది. ఇంతటితో వర్షం తగ్గితే కిందకు నీరంతా ఇంకి పోతుంది. మరొక 45 గంటల్లోవర్షాలు ఇలాగే కురిస్తే పంటలు ఇంకా బాగానే నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల కష్టం నేలపాలు అయ్యిందని, ఆరు నెలల పాటు కష్టపడి, శ్రమ చేసి ప్రాణాలను పణంగా పెట్టి రైతుల కష్టం వర్షం పాలైంది. వేలాది రూపాయలను పెట్టుబడి పెట్టారని, అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే ప్రకృతి కన్నెర్ర చేసిందని రైతులు గుండె బాధుకుంటున్నారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా ప్రజలు నిత్యావసర సరుకుల వస్తువుల ధరలకు బయటకు రాలేకపోతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు బయటకు వెళ్ళలేకుండా కష్టంగా మారింది. ఏజెన్సీలో వాహనాలకు వర్షం కురుస్తుండడం రోడ్డు కనిపించకుండా పోయింది. పస్రా నుండి ఏటూరునాగారం హైవే రోడ్డుపై నడిచే వాహనాలకు వర్షం కురుస్తుండడంతో రోడ్డు కనిపించకుండా పోతుంది. వాహనాలు ఎదురు ఎదురుగా వస్తే యాక్సిడెంట్లు జరిగే అవకాశాలు ఉన్నాయి.



## మేడారం రోడ్లకు మరమ్మత్తులు లేనట్లేనా .?

**గుంతలు పడిన రోడ్లతో వాహనదారులు ఇక్కట్లు**

**మహాజాతర పనులపై అధికారులకు పట్టింపే లేదు**

**ఇంకా 60 రోజులే మహా జాతర మిగిలి ఉంది**

**అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని ఆరోపణ**

**మేడారం, ప్రభాతవార్త :**

మేడారం రోడ్లకు మరమ్మత్తులు లేనట్లేనా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక లారీలు నడవడంతో రోడ్లపై గుంతలు పడ్డాయి. వాహనాలు నడవలేని విధంగా ప్రమాదకరంగా ఉన్నాయి. శివరాంసాగర్ చెరువు మూలమలుపు నుండి ఆర్టీసీ వై జంక్షన్ వరకు రోడ్డుపై అక్కడక్కడ గుంతలు పడ్డాయి. రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఎంత నాణ్యతగా చేశారో తెలుస్తుంది. అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఏడాదికే రోడ్డంతా పాడైపోయాయి. మళ్ళీ జాతర రానే వస్తుంది. రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్లకు పనులు కల్పిస్తే నాలుగు పైసలు మిగిలేది. వీళ్ళకు రావాల్సిన పర్సంటేజీలను కాంట్రాక్టర్లు చెల్లించేవారు. జంపన్నవాగు వద్ద కూడా రోడ్డంతా కొట్టుకుపోయింది. గుంతలు అలాగే వదిలేశారు. దీంతో పాటుగా నార్లాపురం ఊరి చివర బ్రిడ్జి దగ్గర నుండి చింతల క్రాస్ రోడ్డు దాక రోడ్డంతా వరద తాకిటికి కొట్టుకుపోయింది. వాహనాలు నడవలేని విధంగా గుంతలు పడ్డాయి. ఆ గుంతల్లో సంబంధిత శాఖ అధికారులు మొరం పనులు చేసి చేతులు దులిపేశారు. తాత్కాలిక పనులతో వదిలేశారు. ప్రయాణికులతో పస్రా నుండి మేడారం వెళ్ళే రోడ్డు రద్దీగా ఉంటుంది. గుంతల వలన వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పడిగాపురం కాజ్వే కూడా వరద తాకిడికి కొట్టుకుని పోయింది. భక్తులకు సౌకర్యంగా ఉండే విధంగా రోడ్ల మరమ్మత్తు పనులను చేయాలని కోరుతున్నారు.





## ఇక సింగరేణి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సారి ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా 39,748 మంది కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటుండగా ఇందు కోసం 13 గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు పోటీలో నిలిచాయి. ఓటు హక్కును వినియోగించుకోవటం కోసం సింగరేణి పరిధిలో 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగింది.

**సింగరేణిలో ఎన్నికల వాతావరణం.......**

అసెంబ్లీ ఎన్నికలు ముగియగా ఈనెల 27న ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సింగరేణి ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో మరో ఎన్నికకు ఆయా జిల్లాల పరిధిలోని 11 ఏరియాలకు చెందిన సింగరేణి కార్మికులు ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు. దీంతో ఎన్నికల వాతావరం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ స్వతహాగా పోటీ చేయగా కాంగ్రెస్ పార్టీకి సీపీఐ, వైఎస్సార్ తెలంగాణ పార్టీ, తెలంగాణ జన సమితి మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం సింగరేణిలో కొనసాగుతున్న ఏఐటియుసి, ఐఎన్టియుసి యూనియన్లు మద్దతు ప్రకటించాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొంత ఈజీగా మారింది. ఈ సింగరేణి ఎన్నికల్లో సీపీఐ అనుబంధ ఏఐటియుసి, కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టియుసిలు రెండు వేర్వేరుగా పోటీ చేస్తాయా, లేక ఉమ్మడిగా పోటీలో నిలుస్తాయనేది ఇంకా తెలాల్సి ఉంది. సింగరేణి వ్యాప్తంగా 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇప్పటికే ఓటరు లీస్టులో అభ్యంతరాలను స్వీకరించారు. అక్టోబర్ 7న నామినేషన్లను 13 సంఘాల నుండి స్వీకరించిన ఎన్నికల అధికారులు, షెడ్యూల్ ప్రకారం 27న ఎన్నికలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించిన అనంతరం ఆయా ఏరియాల్లో అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తారు.

**ఏరియాల వారిగా ఓటర్లు......**

సింగరేణిలోని 11 ఏరియాల్లో 39748 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ఈనెల 27న వినియోగించుకోనున్నారు. బెల్లంపల్లిలో 985, మందమర్రిలో 4876, శ్రీరాంపూర్లో 9124, కార్పోరేట్లో 1192, కొత్తగూడెంలో 2370, మణుగూరులో 2414, ఇల్లందులో 603, నైనీ బ్లాకులో ఇద్దరు, భూపాలపల్లిలో 5350, రామగుండం 1 రీజియన్లో 5430, ఆర్జీ 2లో 3479, ఆర్జీ 3లో 3063, అడ్రియాల లాంగ్వాల్ ప్రాజెక్టులో 944 మంది ఓటర్లు ఉన్నారు.

**అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పడేనా..?**

నవంబర్ 30న తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి డిసెంబర్ 03న కౌంటింగ్ జరుగగా అధికార బిఆర్ఎస్ పార్టీని కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. 10 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగిన బిఆర్ఎస్‌ను ఓడించటం జరిగింది. ఆ తర్వాత వచ్చిన సింగరేణి ఎన్నికల్లో కార్మికులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. గత ప్రభుత్వ వ్యతిరేకతను స్పష్టంగా చూసిన క్రమంలో ఈసారి సింగరేణిలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికలు ఆ పార్టీ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంపై పడుతుందా, లేక ఇతర సంఘాలకు తమ ఓటును వేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో ఏఐటియుసి, ఐఎన్టియుసి, టీబీజీకేఎస్లకు గుర్తింపు సంఘం హోదాను కట్టబెట్టిన కార్మికులు ఆ సారి ఏ సంఘం వైపు మొగ్గు చూపుతారో చూడాల్సి ఉంది.

## రేవంత్ అను నేను..

(మొదటి పేజీ తరువాయి..)

కాగా నేడు రేవంత్ సీఎంగా మరికొందరు మంత్రులుగా ప్రమాణ స్వీకారానికి ఎల్‌బి స్టేడియం ముస్తాబైంది. గత రెండు రోజులుగా ఓరుగల్లు నుండి రేవంత్ క్యాబినెట్‌లో కాంగ్రెస్ సీనియర్ నేతలైన వరంగల్ తూర్పు నుండి ఎమ్మెల్యే కొండా సురేఖకు ములుగు ఎమ్మెల్యే సీతక్కలకు చోటు దక్కనున్నట్లు వార్తలు వెలువడిన విషయం విధితమే. అనుకున్నట్టుగానే ఇరువురికి రేవంత్ క్యాబినెట్‌లో చోటు దక్కడంతో అటు సీతక్క అనుచర వర్గంలో, ఇటు కొండా సురేఖ మురళీధర్‌ల అనుచర వర్గాలు ఆనందంలో సంబరాలు జరుపుకుంటున్నారు. ఆనందంలో మునిగి తేలుతున్నారు. కాంగ్రెస్ అధిష్టానం మొదటి నుండి సీనియర్లకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పినట్లుగానే ఇరువురు ఓరుగల్లు ఫైర్ బ్రాండ్స్‌గా పేరున్న సురేఖ, సీతక్కలకు మత్రి వర్గంలో అవకాశం లభించడంతో ఓరుగల్లు కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం రెట్టింపు అయింది. నేడు సీఎంగా ప్రమాణం చేయనున్న రేవంత్‌రెడ్డి వారు ముందుగా ప్రకటించినట్లుగానే తెలంగాణాలో ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపిస్తానని ప్రజాపాలన అందిస్తానని ప్రగతిభవన్‌లో సామాన్యులను సైతం కలుస్తానని నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలాగానే సామాన్యుల సమస్యలను విని సచివలయంలోనే పరిష్కరిస్తానని రేవంత్ ప్రకటించడంతో సామాన్యప్రజలు సైతం హర్షిస్తున్నారు. ప్రగతి భవనం కాస్తా ప్రజా పరిపాలన భవనంగా మారుతుండటంతో ప్రజలు స్వేచ్ఛగా తమ సమస్యలను నేరుగా సీఎం దృష్టికే తీసుకెళ్లే అవకాశం దక్కుతుండటంతో నాటి వైఎస్ పరిపాలన రోజులు గుర్తుకొస్తున్నాయని ఓరుగల్లు ప్రజలు గుర్తుకు చేసుకోవడం గమనార్హం.

# చేతికి వస్తది అనుకుంటే నేలమట్టమైంది

## తలలు పట్టుకున్న రైతులు

*బయ్యారం డిసెంబరు 6(ప్రభాతవార్త*

వారంరోజుల్లో పూర్తిగా వరికోతలు ముగిసే సమయంలోనే మిచౌంగ్ తుపాన్ రావడంతో చేతికివస్తది అనుకున్న వరిపంట కండ్లముందే నేలమట్టం కావడంతో రైతులు లబోదిబో అంటూ విలపిస్తున్నారు. బయ్యారం మండలంలోని బయ్యారం పెద్దచెరువు కింద 15 వేల ఎకరాలు అట్లనే గార్ల చెరువు కింద5వేల ఎకరాలు వరిపంట వెయ్యగా పంట దిగుబడి కూడా బాగానే ఉంది రైతుల్లో కొంతఅనందం కన్పించగా తుపాన్‌తో రైతుల గుండెపగిలింది. అనేకమంది రైతులు అప్పులు తెచ్చిపంటలు పడింస్తే నోటికాడికి వచ్చిన పంట తుపాన్‌దెబ్బంతో చేతికి రాకుండా పోతుంటే రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేని వాన అపై ఈదురుగాలులకు వరి నేలకు వరిగింది. వరికంకులు బరువుగా ఉండటం గాలి వేగంగా రావడంతో నేలను సరుస్తుకుంది. మానుకోట జిల్లాలోనే బయ్యారం దాన్యాగారంగా ఉంది. కాని



ఈసారి ఈ తుపాన్ వల్ల ఈ ప్రాంతంలోని కూలీలకు పనిదొరకకుండా పోయ్యింది. రైతులు అప్పులపాలవుతరు. కోతమిషన్లకు కూడానష్టమే దాదాపుగా కోట్లరూపాయల పంట నష్టం జరిగింది. ఈలాంటి సమయంలో ప్రభుత్వం ముందుకు వచ్చి పంట నష్టంను అంచనావేసి రైతులనుఅదుకోవాల్సిన బాద్యత ఉంది . పాలకులు అలా నడుస్తారో లేదంటే గత పాలకుల దారిలోనే నడిచి పంటనష్టం ఇవ్వరో చూడాలి. కాని ఈ తుపాన్ వల్ల అన్న దాత నడివిరిగింది. మిర్చి తోటలకుకూడా నష్టం వాటిల్లింది ఈదురుగాలులకునేలకు వరిగాయి.

గెలిచినోళ్లు రాలే.. ఓడినోళ్లురాలే

కోట్లాది రూపాయల వరిపంట నేలపాలైనా,



నేటి గెలిచిన పార్టీ నాయకులు రాలేదు అట్లనే ఓడిపోయిన నేతలు కూడా ఇటువైపుగా కన్నెతి చూడలేదు. ఇదే సమయంలో ఎన్నికలు ఉండిఉంటె పోటీలు పడి రావడమేగాక మా ప్రభుత్వం వచ్చిన వెంటనే అదుకుంటామని చెప్పి ఓట్లు దండుకునే వారు కాని ఓట్లపండుగపూర్తి అయినతర్వాత ఈ తుపాన్ రావడం కూడా రైతులకు నష్టమే జరిగింది. కష్టాల్లో ఉన్న రైతులకు తాము ఉన్నాముఅనే భరోసా ఇచ్చే నేతలు ఇటువైపుగా రాలేదు. పాలకులురాకపోయినా ప్రతిపక్షనేతలువచ్చి మా తరుపున నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చెయ్యడం కోసమైనా రావాలని రైతులు కోరుతున్నారు.

## ప్రపంచ మేధావి అంబేద్కర్

*మహబూబాబాద్,డిసెంబర్6,ప్రభాతవార్త*

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి స్థానిక కోర్టు ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో 140కోట్ల జనాభా ఎలాంటి కోట్లాట లేకుండా దూరదృష్టితో ప్రజలందరు సమానంగా జీవించాలనే సంకల్పంతో ఆనాడు భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. దాదాపు 70సంవత్సరాలుగా ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సమాజాలు నిర్మితమవుతున్నాయని ఏ ఇనిస్టిట్యూట్‌కు ఏం కావాలో, ఆర్థిక అసమానతలు, కులమతాలకు అతీతంగా ఉండేలా 100ఏళ్లకు ముందుగానే ఆలోచించి భారత రాజ్యాంగాన్ని రచించాడన్నారు. అట్టడుగు బలహీన వర్గాలకు అండగా భారత రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ప్రముఖ న్యాయవాది, ఆర్థికశాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త అని అంటరానితనం, కులనిర్మూలన కోసం ఎంతో కృషిచేశాడన్నారు. అంబేద్కర్ అందరివాడని ఏ ఒక్క వర్గానికి సొంతం కాదని ప్రపంచ మేధావి అని కొనియాడారు. అంబేద్కర్ 1956నంబర్6న మరణించాడని అతని ఆశయాలను మనమందరం ముందుకు తీసుకెళ్లాలన్నారు. మున్సిపాలిటి కేంద్రంలో అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని



తయారుచేయడంలో పాలకమండలి అందరు సహకరించారని వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, బిఆర్ఎస్ వార్డు కౌన్సిలర్‌లు మార్నేని వెంకన్న, బొనగిరి గోపిరత్నం గంగాధర్, గోపి, అంబేద్కర్ సంఘం సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

----

# వివక్షతలేని సమాజ నిర్మాణమే అంబేద్కర్ ఆశయం

*కురవి,డిసెంబర్6,ప్రభాతవార్త*

వివక్షత, అసమానతలు లేని భారత్‌గా రూపుదిద్దుకోవడమే అంబేద్కర్ ఆశయమని అందుకోసం తన జీవితాన్ని దారపోసిన మహనీయుడు అంబేద్కర్ అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం హక్కులను పొందుపర్చిన నవయుగ వైతాళికుడు అంబేద్కర్ అన్నారు. సామాజిక న్యాయం అందని ద్రాక్షగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, కన్న వెంకన్న, తురక రమేష్, నాగేశ్వర్‌రావు, అప్పాల



వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, అనిల్, విజయ్ పాల్గొన్నారు.

## అపరమేధావి బి.ఆర్ అంబేద్కర్

*మహబూబాబాద్*

*నెహ్రూసెంటర్,డిసెంబర్6,ప్రభాతవార్త*

డాక్టరన బి.ఆర్ అంబేద్కర్ అపర మేధావి అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. బుధవారం కోర్టు ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా



నివాళులు అర్పించారు. అంటరాని తనం, అసమానతలు, వివక్షతలపై అలుపెరుగని పోరాటం చేసి అనునిత్యం పరితపించిన గొప్పవ్యక్తి అంబేద్కర్ అన్నారు. రాజ్యాంగంలో అట్టడుగు జాతి వారికి కూడా సముచిత స్థానం కల్పించారన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని నేటి యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతురాజు, బెల్లంకొండ శ్రీనివాస్, మాలోతు నరేష్, లింగాల వీరభద్రం, రాము, కోడిశ్రీను, దిలీప్, రమేష్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

-----

## రాకపోకలు సాగించకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

*గార్ల, డిసెంబర్6 ప్రభాతవార్త:*

మిచౌంగ్ తుఫాన్ కారణంగా అకాలంగా కురుస్తున్న వర్షాలు, ఈదురుగాలులకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాఖాలయేటి ఉధృతి పెరగవచ్చని చెక్‌డ్యాంపై నుండి సమీప గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించకుండా తగుచర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి సంగ్రామ్‌సింగ్ జి పాటిల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. రాంపురం సమీపంలో ప్రవహిస్తున్న పాఖాల యేటి చెక్‌డ్యాంను పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. తుఫాన్ వలన మోస్తరుగా కురుస్తున్న అకాల వర్షాలకు వాగుల్లో, కుంటలలో నీరుచేరి ఉధృతంగా ప్రవహిన్నాయని పాఖాలయేటికి ఏసమయంలోనైనా వరద తాకిడి ఉండవచ్చని సూచించారు. రాంపురం, మద్దివంచ పంచాయి తీల పరిధి గ్రామాల ప్రజలు చెక్‌డ్యాం మీదుగా రాక పోకలు చేయకుండా భారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివే యాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటు అత్యవసర సమయంలో



హెల్ప్‌లైన్ నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్‌శాఖ అధికారులు కూడ అందుబాటులో ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిఎస్పి సత్యనారాయణ, గార్ల బయ్యారం సిఐ బాబురావు, గార్ల ఎస్సై బాణోత్ వెంకన్న, తదితరులు ఆయన వెంటున్నారు.

మహబూబాబాద్ వార్త



మహబూబాబాద్, తొర్రూరు

## అసమానతల అంతమే అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి



*మహబూబాబాద్,డిసెంబర్6,ప్రభాతవార్త*

భారతదేశంలో అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే అంబేద్కర్‌కు మనం ఇచ్చే నివాళి అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెలరాంమ్మూర్తి అన్నారు. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక గాంధీపార్కులో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహేందర్,రాంమ్మూర్తి మాట్లాడుతూ కులం పునాదులపై ఒక జాతిని, ఒక నీతిని నిర్మించలేమన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కులధారిత సమాజాన్ని కూలదోసి మానవ సమాజాన్ని నిర్మించాలని ఆయన భావించారన్నారు. మనువాదం సృష్టించిన జబ్బు కులం అని మనస్మృతి గ్రంథాన్ని ఆనాడే తగలబెట్టిన విజయం అందరికి తెలిసిందే అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు చీపిరి యాకయ్య, నాగెల్లి సురేష్, కొమ్ము శ్రీనివాసన, గణేష్, చిరంజీవి, రాములు, శ్రీధర్, నాగేష్, జోగ్యనాయక్, సీతారాంనాయక్ పాల్గొన్నారు.

## తుఫాన్ బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

*మహబూబాబాద్‌నెహ్రూసెంటర్,డిసెంబర్6,ప్రభాతవార్త*



మిచౌన్గ తుఫాన్‌లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని బిసి సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి, మానుకోట జిల్లా కాంగ్రెస్ నాయకులు శంతన్‌రామరాజు రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం శనిగపురంలోని వరికల్లాలను, కోతకొచ్చిన వరిపంటలను పరిశీలించి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మహబూబాబాద్ నియోజకవర్గంలోని పంటలు దెబ్బతిన్నాయన్నారు. కోతకొచ్చిన వరిపంటలతోపాటు పొలాల్లో ఉంచిన ధాన్యం తడిసిపోయిందన్నారు. అకాల వర్షానికి తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొంటుందన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కావన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు రాంశెట్టి ఉప్పలయ్య, ప్రేమ్‌సాగర్ రామరాజు, సారయ్య, బాలరాజు, జాన్ విక్టర్, అలువాల వెంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

*మరిపెడ,డిసెంబర్1,ప్రభాతవార్త*



భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం నేటి యువతియువకులు కృషిచేయాలని ఓడిసిఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటిలో అంబేద్కర్ 67వ వర్ధంతిలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సేవలు మరువలేనివన్నారు. దళితజాతి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. యువతియువకులు చెడుమార్గాలను అన్వేశించకుండా అంబేద్కర్ సూచించిన మార్గాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశానికి చేసిన సేవలు ఎన్నటికి మరువలేమన్నారు. అంతరాలు లేని భారతీయ సమాజం కొరకు పరితపించి భారత రాజ్యాంగ రూపకల్పన చేసిన బహుముఖ ప్రజాజ్ఞశాలి అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ఎడెల్లి వెంకటేష్, కౌన్సిలర్‌లు ఎడెల్లి పరుశురాములు, హత్తిరాం, కిషన్, గణేష్, భద్రయ్య, కాటయ్య, సైదులు, వెంకన్న, ఉప్పలయ్య, గోల్కొండ ఉప్పలయ్య, కృష్ణ, సురేష్, రవి, ఇద్దయ్య, అశోక్, హరీష్, మల్సూర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం... అపార నష్టం

## నోటికందిన కూడు వర్షార్పణం.. లబోదిబోమంటున్న అన్నదాతలు



**నల్లబెల్లి, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

గత మూడు రోజులుగా అకాల వర్షాలతో వివిధ రకాల పంటలు దెబ్బతినడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. చేతికందిన పంట కాస్తా వర్షార్పణం కావడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వేల ఎకరాల్లో వరిపంట, మిర్చి పంట, పత్తిపంట వర్షాలకు దెబ్బతినడంతో అన్నదాతలు కన్నీటి పర్యాంతమవుతున్నారు. గత సంవత్సరం సన్నవరి ధాన్యం తక్కువగా పండటంతో సన్నధాన్యానికి ఆకాశాన్ని అంటేవిధంగా బియ్యం ధర పెరగడంతో రైతన్నలు ఈ ఏడు సన్న వరి ధాన్యం పండించేందుకు సుముఖత చూపారు. దీంతో ఏ ఏడు అయినా సామాన్య మానవులకు బియ్యం ధర అందుబాటులోకి వస్తుందనే సంతోషం అనుకునేలోపే అకాల వర్షాలతో వరి ధాన్యం పూర్తిగా దెబ్బతింది. దీంతో అటు అన్నదాతలు ఇటు సామాన్య మానవులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల పంట నష్టంపై ప్రభుత్వం సంబంధిత వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ అధికారులతో తక్షణమే అంచనావేయించి పరిహారం అందించాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా మరో మూడు రోజులు తుఫాను ప్రభావం ఉన్నందున అన్నదాతలకు, ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం, అందుబాటులో ఉండి తగు సూచనలు ఇవ్వాలని, మండల ప్రజలు రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన ఎన్నారై

**నర్సంపేట, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును నర్సంపేట పట్టణానికి చెందిన ఎన్నారై పిన్నా భాస్కర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ ఎన్నికల్లో భారత రాష్ట్రపతి సమితి అభ్యర్థులను గెలిపించాలని, మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని గత నెల రోజుల క్రితం ప్రత్యేకంగా అమెరికా నుంచి పిన్నా భాస్కర్ ఆధ్వర్యంలో కొంతమంది ఎన్నారై తెలంగాణ రాష్ట్రానికి వచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రధానంగా నర్సంపేట నియోజకవర్గంలో నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ సహకారంతో ఎన్నారైలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి పెద్ది సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. కాగా ఎన్నికల ఫలితాల అనంతరం మర్యాద పూర్వకంగా బుధవారం ఎన్నారై భాస్కర్ సీఎం కేసీఆర్ కలిసి అమెరికాకు వెళ్లి పోయారు. ఈ సందర్భంగా ఎన్నారైనా పిన్నా భాస్కర్ మాట్లాడుతూ అమెరికాలో వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డాము, అయినా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారంలోకి రావాలని, ఆయన నేతృత్వంలోనే బంగారు తెలంగాణ ఏర్పాటు జరుగుతోంది అన్నారు. ఏదిఏమైనా ప్రజా తీర్పుకు శిరసావహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయాలని కోరారు.



# అకాల వర్షాలతో పంటలకు నష్టం

**నర్సంపేట, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

అకాల వర్షాలు కురియడంతో డివిజన్‌లోని రైతాంగం పలు రకాల పంటలను నష్టపోతున్నారు. ప్రతి యేడు లాగే ఈ సంవత్సరం కూడా చేతికందే సమయంలో అకాల వర్షాలు కురియడం వల్ల వరి, మిర్చి పత్తిపంటలకు తీవ్ర నష్టం కలుగుతుంది. ఖరీఫ్ సీజన్‌లో వేసి వరిపంటలో ప్రస్తుతం కోత దశకు చేరుకున్నాయి. కొంత మంది రైతులు వరిపంటలు కోసం కళ్లాల్లో పోశారు. కళ్లాల్లో పోసిన ధాన్యం వర్షానికి తడువడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరాకు రూపాయలు 30 నుంచి 40వేల పెట్టుబడి పెట్టి చేతికందే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడం వల్ల తీవ్ర నష్టం కలుగుతుంది. అదేవిధంగా కొంత మంది రైతులు పెట్టిన మిర్చి తోటలు ఏరే దశకు వచ్చాయి. అదేవిధంగా పూత కాత ఉన్న తోటలు వర్షాల వల్ల వైరస్ తెగుళ్లభారిన పడే అవకాశం ఉంది. పత్తిపంట సైతం చేతికందే దశలో అకాల వర్షాలు పడుతుండటం వల్ల పంట నష్టమవుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతుంది.





# సంపత్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

## ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**

జనగామ జడ్పీచైర్మన్, బీఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి అన్నారు. జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జడ్పీచైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి సంతాపసభ ను నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సంతాపసభకు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య, జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరై సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచిన గొప్పనాయకుడు సంపత్‌రెడ్డి అని, ఉద్యమంలో అనేకసార్లు పోలీసులచే దెబ్బలుతిని జైలుకు వెళ్లారని, ఇవి గుర్తించిన కేసీఆర్ సంపత్‌రెడ్డికి పార్టీలో సముచిత స్థానం కల్పించారని,



సంపత్‌రెడ్డి లేని లోటు బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటుగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీతోపాటు అందరం కూడా సంపత్‌రెడ్డి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలిపారు. సంతాప సభలో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, మండల శ్రీరాములు, కృష్ణారెడ్డితోపాటు జనగామ జిల్లాకు చెందిన మూడు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించిన
# అధికారుల కృషి అభినందనీయం



**మహబూబాబాద్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించి విజయవంతం చేసిన అధికారుల కృషిని జిల్లా కలెక్టర్ శశాంక ప్రత్యేకంగా అభినందించారు. అక్టోబర్ 9న ఎన్నికల నగారా మోగిన నాటి నుండి నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడంలో కృషిచేసిన రెవెన్యూ, పోలీస్, జిల్లా నోడల్ అధికారులకు అప్పగించిన పనులను పారదర్శకంగా నిర్వహించడంలో ప్రతిభచూపిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సమయస్ఫూర్తితో, అంకితభావంతో నిర్వహించి విజయవంతం చేయడంలో ప్రముఖపాత్ర పోషించిన ప్రతి ఒక్కరు సమర్థులన్నారు. జిల్లాకు విచ్చేసిన ఎన్నికల అబ్జర్వర్‌లకు నియమించిన అధికారులతో పాటు విధులు కేటాయించిన ప్రతి ఒక్కరు తమ విధుల్లో రాణించాలన్నారు. ఇకముందు కూడా ఇలాగే పనిచేస్తూ జిల్లా పేరు నిలుపాలన్నారు. ఈ సమావేశంలో అధనపు కలెక్టర్ డేవిడ్, జెడ్పిసీఈవో రమాదేవి, డిఆర్‌డిఏ సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిచౌన్గ్‌తుఫాన్‌తో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలం

### జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి

**మహబూబాబాద్, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న మిచౌన్గ్‌తుఫాను వల్ల జిల్లా అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ వల్లూరి కృష్ణారెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అంటువ్యాదులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతికొచ్చిన పంట నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో వైద్యులు పర్యటించి తగిన జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు సూచించాలన్నారు. రానున్న రెండు రోజులు తుఫాను ఉన్నందున చిన్నపిల్లలు బయటకు రాకుండా తల్లిదండ్రులు జాగ్రత వహించాలన్నారు.

## డాక్టర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**భూపాలపల్లి, డిసెంబర్06, ప్రభాతవార్త**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని భూపాలపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని స్టేడియంలోని అంబేద్కర్ విగ్రహానికి 67వ వర్ధంతిని పురస్కరించుకొని పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తన జీవితంను జాతికి అంకితం చేసిన మహానీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని అన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాల కోసం భారత రాజ్యాంగంను రాసి వారి జీవితాల్లో వెలుగులను నింపారని అన్నారు. ఆయన స్ఫూర్తి మనందరికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజిఎం బండి వెంకటయ్య, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారాం, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ఎంవి రావు, బందెల చందర్‌రావు, బుక్క మోహన్, హేమానాయక్, ఆర్ చంద్రశేఖర్‌రావు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



# రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన ఎన్‌సిసి విద్యార్థులు

### అభినందించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్ రావు



పోచమ్మ మైదాన్, ప్రభాతవార్త

పదో బెటాలియన్ ఎన్‌సిసి వరంగల్ ఆధ్వర్యంలో దేశాయ్‌పేటలోని సికెఎం ప్రభుత్వ కళాశాలకు సంబంధించిన ఎన్‌సిసి విద్యార్థులు అయిన బికాం తృతీయ సంవత్సరానికి చెందిన జెయు ఓఎస్ రాజేష్, బిజెడ్ సి తృతీయ సంవత్సరానికి చెందిన మౌనిక వీరు 2024 జనవరి 26వ తేదీ ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్వహించే సైనిక కవాతు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంపికైనందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి అనేది ఒక క్రమశిక్షణతో కూడుకున్న సంస్థ అని ఇందులో చేరిన విద్యార్థులు కష్టపడడం విద్యార్థి దశ నుంచి అలవర్చుకుంటారని వారు జీవితంలో స్థిర పడడటానికి కఠోరమైనటు వంటి శ్రమ చేస్తారని అందుకు నిదర్శనమే మా కళాశాలలో చదువుకునేటు వంటి ఈ ఇద్దరు ఎన్‌సిసి విద్యార్థులే నిదర్శనమని ఆయన అన్నారు. అంతేకాకుండా సికెఎం కళాశాలలో ఎన్‌సిసి ఆఫీసర్‌గా విశిష్ట సేవలు అందిస్తూ ఎన్‌సిసి విద్యార్థులతో పాటు కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్న కెప్టెన్ డాక్టర్ పి.సతీష్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, హవల్దార్ విజయ్‌కుమార్, లైబ్రేరియన్ అనిల్, మోహన్, శ్రీనివాస్, రమేష్, పూర్ణ, రవి, మాధవి, కాత్య, రఫీక్‌లతో పాటు ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పలువురు సహచర విద్యార్థులను కూడా అభినందించారు.




## వరంగల్ తూర్పులో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు

పోచమ్మ మైదాన్, డిసెంబర్ 06, ప్రభాతవార్త

వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖకు కాంగ్రెస్ అధిష్టానం మంత్రి పదవి ఇస్తారనే సమాచారంతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు ఎండి. అయూబ్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ జంక్షన్, వరంగల్ చౌరస్తాలో పెద్దఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకుంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోపిడీ నియంత పాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకున్నారని, ప్రజలతోపాటు కార్మిక, కర్షక, ఉద్యోగ, నిరుద్యోగుల అన్ని వర్గాలు ఒక్కటై కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటున్నారని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా నేడు తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నటువంటి అనుమలు రేవంత్ రెడ్డికి వరంగల్ తూర్పు ప్రజల పక్షాన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ తూర్పు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన కొండా సురేఖకు అధిష్టానం మంత్రి పదవి ఇస్తున్నారనే సమాచారంతో జిల్లా పార్టీ శ్రేణులంతా సంబరాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ నూతన సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

### శుభాకాంక్షలు తెలుపుతున్న నడికూడ కాంగ్రెస్ నాయకులు



నడికూడ,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్‌రెడ్డికి నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.సీనియర్ నాయకులు పర్నెం మల్లారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు మార్పును కోరుకున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలనా సాగుతుందన్నారు.పరకాల కాంగ్రెస్ అభ్యర్థిని రేవూరి ప్రకాశ్‌రెడ్డిని గెలిపించినందుకు పరకాల ప్రజలకు దన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే రేవూరి సహకారంతో నడికూడ మండలం అభివృద్ధి జరుగుతుందన్నారు.

## పశ్చిమ ఎమ్మెల్యే నాయికిని క్యాబినెట్లో అవకాశం కల్పించాలి



### యూత్ కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

ప్రభాతవార్త- బాలసముద్రం:

హనుమకొండ జిల్లా పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డికి క్యాబనెట్లో అవకాశం కల్పించాలని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూత్ నేతలు కాంగ్రెస్ అదిష్టానానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నేతలు ఆలువాల కార్తిక్, భీమ్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుంచి ఒకే పార్టీ ఒకే జెండా అనే ఆలోచనతో హనుమకొండ జిల్లా ప్రజలకు మమేకమై నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తలను తయారు చేసినటువంటి ఘనత నాయిని రాజేందర్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. ఎంత మంది నాయకులు ఎన్ని అవకాశాలు ఇచ్చినా పార్టీని పట్టుకొని కార్యకర్తలను పట్టుకొని గత 35 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్నెం అరుణ్‌రెడ్డి, కే.సెహ్వాగ్, యువజన కాంగ్రెస్ నాయకులు అజ్మీర్, సునీల్, నాయక్, భ్యూ మనితేజ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు సాగాలి

### ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభాతవార్త- సుబేదారి:

దేశంలోని నేటితరం యువత విద్యార్థులు అంబేద్కర్ ఆలోచన విధానంతో ముందుకు నడవాలని కాకతీయ యూనివర్సిటి విద్యార్థి నేత ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. బుధవారం రోజున అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌డీఎల్‌సీఈ దగ్గర ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటి విద్యార్థులు, మచ్చ పవన్‌కళ్యాణ్, శిరీష, ప్రవళి, వైష్ణవి, మానస, అనూష తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప గులాభీ సైనికున్ని కోల్పోయాం

### పశ్చిమ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

ప్రభాతవార్త- బాలసముద్రం:

గొప్ప గులాభీ సైనికున్ని కోల్పోయామని బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిన నాయకుడు పాగాల సంపత్‌రెడ్డి అని పాగాల సంపత్‌రెడ్డి సంస్కరణ సభలో మాజీ ప్రభుత్వ ఛీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ మాజీ శాసన సభ్యులు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ జనగాం జిల్లా అధ్యక్షుడు జడ్పి చైర్మన్ పాగల సంపత్‌రెడ్డి అకాల మరణానికి చెందిస్తూ సంస్మరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మొదట పాగాల సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జోహార్ సంపత్‌రెడ్డి అంటూ నినాదించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.



## అంబేద్కర్ ఆశయాలను సాదిద్దాం

ప్రభాతవార్త- బాలసముద్రం:

అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దామని అంబేద్కర్ ఆశయాలను సాధిద్దామని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ మాజీ పశ్చిమ శాసన సభ్యులు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం నిర్మాత, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు. అణగారిన వర్గాల అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, టిజిఏ రాష్ట్ర అధ్యక్షులు మర్రి యాదవరెడ్డి, మాజీ రాష్ట్ర రైతు రుణవిమోచన కమీషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

ఏటూరునాగారం రూరల్,ప్రభాతవార్త:

మండల కేంద్రంలో 67వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహామునకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీఎన్‌జిఓస్ జిల్లా కార్యదర్శి పోలు రాజు మాట్లాడుతూ.. ప్రపంచం గర్వించదగిన ముఖ్యులలో మన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అంబేద్కర్ ఒకరని, భారతదేశంలో ఉన్న అన్ని రకాల వ్యవస్థలకు రూపకల్పన చేసి మన దేశాన్ని ప్రపంచానికే తెలిసేలా చేసిన మహోన్నతమైన వ్యక్తి మన అంబేద్కర్ అని, రాజ్యాంగ శిల్పి, ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కృత, అంటరానితనం అస్పృశ్యత, కుల నిర్మూలన కోసం ఎంతగానో కృషి చేసిన అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సురేష్, చరణ్ రాజ్, రవీందర్, వెంకన్న, పైడాకుల రవి, వంకాయల నాగేశ్వర్‌రావు, సాంబశివరావు పాల్గొన్నారు.



# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

**-భారత రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం**
**-కాంగ్రెస్ నాయకులు**

**నర్సంపేట, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తక్కలపల్లి రవీందర్ రావు, వేముల సాంబయ్య గౌడ్ అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గం కన్వీనర్ తక్కలపల్లి రవీందర్ రావు, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిన్న రాష్ట్రాల ప్రధాత అని రచించిన రాజ్యాంగం వారి ఆశ మేరకే సోనియా గాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఎంతో విజ్ఞత కలిగిన కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగతి భవన్‌ను అంబేద్కర్ భవన్‌గా నామకరణం చేసి అంబేద్కర్‌కి నివాళి అందజేశారని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాదాసి రవి, కౌన్సిలర్లు ఎలకంటి విజయ్ కుమార్, ఓర్సు అంజలి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మసూద్ బేగ్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, గాజుల రమేష్, వేముల సాంబయ్య గౌడ్, మోటం రవి, గొర్రె నవీన్, నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, కంచు రవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలోనూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళ్లర్పించారు.

### ఖానాపురంలో...

కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పొడుపుగంటి మధుసూధన్‌రావు, కిసాన్ సెల్ అధ్యక్షులు చెడిపాక ఉపేందర్, రజనీకాంత్, బీసీ సెల్ అధ్యక్షుడు వల్లె శ్రీనివాస్‌యాదవ్, బుధరావుపేట ఎంపిటిసి 1 బిక్కి లింగమ్మ మురళి, మంగళవారిపేట ఎంపిటిసి మూడుపుల సింగ్ నాయక్, ధర్మరావుపేట ఎంపిటిసి విజయకర్ రావు, అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు, యువజన నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### నల్లబెల్లిలో...

ప్రపంచ మేదావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా. సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం మండలంలోని వివిధ సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి ఆయా పార్టీలు దళిత సంఘాలతో పాటు వివిధ సంఘాల నాయకులు, కార్యర్తలు, పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు దేశ పౌరులు సంక్షేమ ఫలాలను అందుకుంటున్నారంటే కుల మత వర్గ విభేదాలు లేకుండా రాజ్యాంగం రాయడం వల్లనే జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అగ్రవర్ణాలలోని నిరుపేదలకు సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు అందుతున్నాయంటే ఆ మహానుభావుడు అయినా అంబేద్కర్ ఆలోచన విధానం రాజ్యాంగ నిర్మాణంతోనే జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాలు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### చెన్నారావుపేటలో....

భారతరాజ్యాంగ నిర్మాత స్వర్గీయ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ వర్ధంతి వేడుకలు మండలంలో బుదవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని చెన్నారావుపేట రాజీవ్‌నగర్ కాలనీలో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలవాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు బారపాక నవీన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నర్మెట్ట సాంబయ్య, జంగిలి రాజు, జంగిలి కిరణ్, మందుల సాగర్, ఆకులపల్లి సుదర్శన్, జంగిలి సతీష్, సారంగం, భాస్కర్ తదితరులు ఉన్నారు.

### ఉప్పరపల్లిలో....

అలాగే మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి సంగెం శంకర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో బూత్ అద్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, గుగులోతు సుమన్, రెడ్డబోయిన ధర్మ, రమేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బొమ్మెర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### నెక్కొండలో....

రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సంపేట టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం నిర్మాణంలో ఆయన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి శివకుమార్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, మండల నాయకులు, కుసుమ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## దొంతికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

**దుగ్గొండి, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డికి మంత్రి వర్గంలో సముచిత స్థానం కల్పించాలని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుదవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వకుండా ఇండిపెండెంట్‌గా నిలవడి గెలిచి అధికార టిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎన్నిక ఆశలు చూపించినా లొంగకుండా తాను నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీని కాపాడిన గొప్ప నాయకులు దొంతి మాధవరెడ్డి అన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎదిగి మచ్చలేకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పూర్తి అవగాహన పట్టు ఉన్న నాయకుడు దొంఇ మాధవరెడ్డికి మంత్రి వర్గంలో చోటుకల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎర్రల్ల బాబు, సర్పంచ్ హింగోలి రాజేశ్వర్‌రావు, నాయకులు చెన్నూరి కిరణ్‌రెడ్డి, బూర్గు రవీందర్, వేముల ఇంద్రదేవ్, నర్సింగరావు, మట్ల రాజు, రాజమల్లు, గంజి నగేష్, సాంబయ్య, కొలగాని రవి, దంజునాయక్, నర్సింహారెడ్డి, రవి, రాజు, గిన్నె స్వామి, కొలిపాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాల్‌నాయక్‌తండాలో బాల్యవివాహం అడ్డగింత

**చెన్నారావుపేట, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్న సంఘటన మండలంలోని కాల్‌నాయక్‌తండా గ్రామంలో బుధవారం నెలకొంది. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన 15 సంవత్సరాల వయసు కలిగిన ఓ బాలిక వివాహం జరిపించేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే విషయం తెలుసుకున్న చెన్నారావుపేట ఎస్ఐ తోట మహేందర్, పంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్, అంగన్‌వాడీ టీచర్ గుగులోతు కుంద, జ్యోతి, సిబ్బంది తండాకు చేరుకున్నారు. వివాహాన్ని ఆపేసి బాలిక తల్లిదండ్రులకు, తండా పెద్దలకు, వారు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాలికలకు వివాహం చేయడం చట్టరిత్య నేరమన్నారు. ఇందుకు ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని సహకరించిన వారిపై చట్టరిత్య చర్యలు ఉంటాయన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# నర్సంపేట వార్త

## నష్టపోయిన రైతంగానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి

**నల్లబెల్లి, డిసెంబర్ 6, ప్రభాతవార్త**



గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో వివిధ రకాల పంటలు దెబ్బతినడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారని రైతులకు నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి రైతులకు భరోసా కల్పించాలని బిఆర్ఎస్ నాయకులు వైనాల కార్తిక్ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో దెబ్బతిన్న వరి, మిర్చి పత్తి పంటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సంబంధిత వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ అధికారులతో నష్టాన్ని అంచనా వేసి అన్నదాతలకు పరిహారాన్ని అందించాలని ఆయన కోరారు. అదేవిధంగా తుఫానువల్ల ఎవరికి ప్రాణ నష్టం జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండేవిధంగా ప్రభుత్వం సూచనలు చేయడంతో పాటు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. వీరివెంట నాయకులు గుండెకారి రాజు, చందర్, అల్లారపు రాజు, వైనాల శంకర్, బండ్ల వేణు, ఇటుకల లితిష్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో దొంతికి మంత్రి పదవి ఇవ్వాలి

**నల్లబెల్లి, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న రోజుల్లో సైతం పార్టీని భలోపేతం చేయడంతో పాటు వివిధ రకాల కష్టనష్టాలకు ఓర్చి ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా ఉన్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి నూతన ప్రభుత్వంలోని మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బేతి భరత్ కోరారు. ఈ సందర్భంగా బుదవారం ఆయన మాట్లాడుతూ నియంతృత్వ పాలన నుండి ప్రజలు విముక్తి చెందడానికి అఖండ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి నూతనంగా చేపట్టబోయే మంత్రి వర్గంలో తప్పనిసరిగా చోటు కల్పించి నర్సంపేటతో పాటు వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేవిధంగా ప్రోత్సహించాలని ఆయన కోరారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఒంటి చేతితో వివిధ నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించిన ఘనత దొంతి మాధవరెడ్డికే దక్కుతుందని ఇది గమణించి కాంగ్రెస్ పార్టీ అదిష్టానం మంత్రి పదవిని అందించాలని ఆయన కోరారు.

## రాజకీయాలకు అతీతంగా పనిచేస్తాం

**ఖానాపురం, డిసెంబర్ 6, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మండలంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు అన్నారు. మండల కేంద్రంలో బుదవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఓటేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాలను అందరికి అమలు చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మండలంలో అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉండేలాగా ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, వెంకటప్రసాద్, బొబ్బపతి, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆకాల వర్షానికి అపారపంట నష్టం

నెల్లికుదురు,డిసెంబర్ 6, ప్రభాతవార్త



మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు పండించి తీర పంటచేతిరకందే ముందు ఆకాల వర్షంతోపాటు, ఉధృతమైన పెనుగాడ్పులు రావడంతో రైతుల దాన్యం రాశులు కొనుగోలు కేంద్రాల్లో పోసుకొగా నీటిలో తడిసాయి.అదే విదంగా రైతుల వరిచేన్లు పంటచేను ల్లోనే కిందపడి పోయాయి, మిర్చి పంటలు నెలకొరిగాయి, పత్తి పంటలు దెబ్బతిన్నట్లు రైతులు ఆందోళనతో ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వం స్పం దించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతు న్నారు.



**నర్సింహులపేట :**

గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన అకాల వర్షంనకు మండలంలోని వివిద గ్రామాల రైతులు వరి,వాణిజ్య పంటలు నీటిలో మునిగి పోగా,వరిదాన్యం కొను గోలు కేంద్రాల్లో రాశులుగా పోసిన వరిరాశులు తడిసిముద్దా యాయ్యి.రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. కాగ మండల కేంద్రానికి చెందిన కౌలురైతు దూరు యాకయ్యకు చెందిన రెండు ఎకరాల వరిపంట నీటమునిగి సుమారు లక్షరూపాల మేరకు నష్టం జరిగినట్లు వాపోయ్యాడు.

**ఇనుగుర్తిలో......**

ఇనుగుర్తి : మండలంలోని పలు గ్రామాల్లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మిర్చి,వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు.వరి పంటతోపాటు మిర్చి పంటలకు లక్షలు ఖర్చుపెట్టి చేతికందిన పంటలు నీటిపాలు కావడంతో రైతులు గుండ్ల వెంకన్న,గుండ్ల సుధాకర్, గుగులోతు రమేష్‌లు ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

తొర్రూరు,డిసెంబర్ 06,ప్రభాతవార్త



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని,సమ సమ సమాజ స్థాపన కోసం బహుజనులంతా ఉద్యమించాలని సిపిఎం తొర్రూరు మండల కార్యదర్శి ఎండి యాకూబ్ పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక డివిజన్ కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతిని మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం కుల నిర్మూలన సమసభాజ స్థాపన కోసం తన కుటుంబాన ఇన సైతం పట్టించుకోకుండా నిరంతరం దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తన జీవితమంతా పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కోనియాడారు.మహనీయుల జయంతి వర్ధంతిల రోజు మాత్రమే స్మరించుకొని వదిలేయడమే కాకుండా వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొల్లం అశోక్,మర్క సాంబయ్య,జమ్ముల శ్రీనివాస్,దొనక దర్గయ్య,తిమ్మిడి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

రాయపర్తి, డిసెంబర్ 6, ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ వాదులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అవార్డు గ్రహిత ఐత మల్లేష్, బూర్తు నవీన్, గారె సందీప్, వేల్పుల వెంకట సాయిలు, ఐత లక్ష్మణ్, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.



## బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

పెద్దవంగర,డిసెంబర్6,ప్రభాతవార్త



బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని కృషిచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. బుధవారం బాబాసాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని అన్నారు. పేద ప్రజల ఆశాజ్యోతి అంబేద్కర్ అడుగుజాడల్లో నడువాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ మహిళ అధ్యక్షురాలు చిలుక దేవేంద్ర, బిఎస్పి మండల పార్టీ అధ్యక్షుడు రాంపాక కిరణ్, ఎస్టిసెల్ అధ్యక్షుడు సీతారాంనాయక్, శ్రీనివాస్, సంపత్, వినోద్, వేణు, పవన్, సాయి, చంటి, కమలాకర్, దామోదరరెడ్డి, యాకయ్య,య సురేష్, చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

ఎడ్యుకేషన్ కేయూ, డిసెంబరు 6 ప్రభాతవార్త :



హన్మకొండ సుబేదారిలోని కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాణ పునాది రాయి అని, దేశంలో సామాజిక ఆర్థిక అసమానతలను నిర్మించడంలో అంబేద్కర్ ఎనలేని కృషిచేశారని, సమాజంలో నెలకొన్న అనేక రుగ్మతలను రూపుమాపుటకు రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులను బడుగు బలహీన వర్గాలు నేడు అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ కర్ణాకర్‌రావు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ పుల్లారమేష్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శేషు, డాక్టర్ చారి, డాక్టర్‌స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొర్రూరు వార్త

## అంబేద్కర్ ఆశయసాధనకు కృషిచేయాలి

నర్సింహులపేట,డిసెంబర్ 6, ప్రభాతవార్త



అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని తహశీల్దార్ వివేక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని ఎంపిడిఓ కార్యాలయం ముందున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళర్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భారతి,ఎంపిఓ సోంమ్లా నాయక్,జల్లా సహాయ కార్యదర్శి మందుల యాకు,మాలమహానాడు రాష్ట్ర నాయకులు గుండాల బిక్షం,యాకయ్య,నరేష్,నాగరాజు,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

ఇనుగుర్తి,డిసెంబర్ 6, ప్రభాతవార్త



మండల కేంద్రంలో అంబేద్కర్ వర్ధంతిని అంబేద్కర్ యువజనసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాగ అంబేద్కర్ విగ్రహానికి తమ్మడపల్లి కుమార్,కొట్టం మహేందర్ రెడ్డి,చిన్నాల కట్టయ్య పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు.మండలంలోని చిన్ననాగారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు చెడుపాక వెంకన్న పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయపాల్‌రెడ్డి,కాంగ్రేస్ పార్టీ మండల మాజీ అద్యక్షులు బైరు అశోక్‌గౌడ్,ఉప సర్పంచ్ మద్దెల సుధాకర్,వార్డు సభ్యులు బైరు శ్రీనివాస్, జ్యోతికోమారెడ్డి,చెడుపాక యాకుబ్,ఉడుత కొమురమల్లు,నాయిని కోంరయ్య,వేణు,యాదగిరి,రాజయ్య,శ్రీను,జంపన్న,శ్రీనివాస్,చంద్రమౌళి, దాసరి అశోక్,నరేష్,రాజేష్,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ కాంగ్రెస్‌లో చేరిన అలీ!

### పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్ని

పరకాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త



పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ అలీ మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్‌లోకి చేరిన అలీ సొంత గూటికి చేరుకున్నాడని పేర్కొన్నారు. తన చేరికకు సహకరించిన హన్మకొండ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనతో కలిసి ఉన్నవారంతా తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వివరించారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ**

**జనగామ టౌన్, డిసెంబరు 6 ప్రభాతవార్త:**
జనగామ జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 30వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో డీసీపీ పి.సీతారాంతోపాటు పోలీసు అధికారులతో కలిసి జడ్జి డి.రవీంద్రశర్మ జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి రవీంద్రశర్మ మాట్లాడుతూ లోక్ అదాలత్‌కు కక్షిదారులు అధికసంఖ్యలో హాజరై తమ కేసులు పరిష్కరించుకునేలా పోలీసు యంత్రాంగం అవగాహన, ప్రచారం కల్పించాలన్నారు. రాజీయే రాజమార్గమన్నారు. పోలీసుస్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, న్యూసెన్స్, చీటింగ్, పిటీ, యాక్సిడెంట్ కేసుల పరిష్కారంకోసం చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దమొత్తంలో కేసు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి సి.విక్రమ్, ప్రధాన జూనియర్ సివిల్‌జడ్జి ఇ.సుచరిత, జనగామ రెండోతరగతి మెజిస్ట్రేట్ డి.వెంకట్రాంనర్సయ్య, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు, పీపీలు, ఏపీలు, సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.




## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**టెలికాన్ఫరెన్స్‌లో ద్వారా సమీక్షించిన జిల్లా కలెక్టర్ శశాంక**

**మహబూబాబాద్, డిసెంబర్6, ప్రభాతవార్త**



తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా తక్షణం స్పందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ శిధిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రం, వైద్యశాల, పాఠశాలలు ఉంటే ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అధికారులు ప్రమాదాలు జరుగకుండా సిబ్బందిని స్థానికంగా సిద్ధంగా ఉంచాలన్నారు. అతివేగంగా గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా, పశువులు ప్రమాధాలకు గురికాకుండా వాటిని విడిచిపెట్టకుండా చూడాలన్నారు. రైతులు, రైతాంగ కూలీలు పొలాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. కేసముద్రం మండలంలోని అర్పణపల్లిని దృష్టిలో ఉంచుకొని అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పలిన్‌లు అదనంగా ఏర్పాటు చేసుకొని ధాన్యం తడువకుండా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని 24గంటల నిర్వహణ కొనసాగిస్తామన్నారు.

## ప్రపంచ తెలుగు సాహిత్య కళోత్సవాల ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్‌గా శ్యామ్

**ఏటూరునాగారం రూరల్, ప్రభాతవార్త:**
ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత, శ్రీశ్రీ కళావేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు సునార్కని శ్యామ్‌కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సంస్థ ఆహ్వానం పలికింది. అంతేకాకుండా ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల కార్యక్రమానికి సునార్కని శ్యామ్‌ని ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్‌గా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయ కర్త, జాతీయ కన్వీనర్, ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల ప్రోగ్రాం కన్వీనర్ కొల్లి రమావతి నియమించారు. ఈ సందర్భంగా సునార్కని శ్యామ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ(ఐఎస్ఓ) గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కతిమండ్ల ప్రతాప్ సారధ్యంలో ఈనెల 16, 17వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం నందు బుద్దాల కన్వెన్షన్ హాలులో 30 గంటల పాటు నాన్ స్టాప్‌గా నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల కార్యక్రమానికి నన్ను ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్‌గా నియమించినందుకు చాలా సంతోషిస్తున్నానని తెలిపారు. నన్ను నియమించిన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్‌కి, జాతీయ కమిటీకి, రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో ఈ కార్యక్రమం పలు వరల్డ్ రికార్డ్‌ను కైవసం చేసుకోనుందని, ఈ బృహత్తర సాహిత్య, కళా ఉత్సవంలో ములుగు జిల్లాలో ఉన్న ఆశక్తికర కవులు, రచయితలు భాగస్వాములై తాడేపల్లిగూడెంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళౌత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు.



## సోనియా రుణం తీర్చే అవకాశం కల్పించారు

**యశస్విని విజయం ఆదర్శనీయం**

**పీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్**



**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**
ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి ఘనవిజయాన్ని చేకూర్చి తెలంగాణ ఇచ్చిన సోనియా రుణం తీర్చే అవకాశం కల్పించారని కాంగ్రెస్‌పార్టీ పీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. బుధవారం ఆయన జనగామలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాజరై మాట్లాడుతూ ఉద్యమ సమయంలో పోరాటంలో ముందుండి పోరాడిన గ్రామీణ ప్రాంత ప్రజలు, యువత, రైతులు నేడు అదే రీతిలో కాంగ్రెస్‌పార్టీకి గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా ఓట్లువేసి ఆదరించారని అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి ఘనవిజయాన్ని చేకూర్చి తెలంగాణ ఇచ్చిన సోనియా రుణం తీర్చే అవకాశం కల్పించారన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేర్చే రోజు వచ్చిందని, ఇది ప్రజల విజయం అని తెలిపారు. 26ఏళ్ల రాజకీయ జీవితంలో పాలకుర్తి నియోజకవర్గంలో మూడుసార్లు అంతకుముందు కూడా మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచి మంత్రిగా పనిచేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావును మామిడాల యశ్వసిని రెడ్డి ఓడించి రికార్డు సృష్టించారన్నారు. ఇది అభినందనీయమని కొనియాడారు. పీసీసీ సభ్యులుగా ఈ విజయాన్ని గర్వంగా పంచుకుంటున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు యర్రమల్ల సుధాకర్, ఎండి.అన్వర్, చెంచారపు బుచ్చిరెడ్డి, శ్రీనివాసచారి, గౌస్, కమలాకర్, శంకర్రావు, కొమురయ్య పాల్గొన్నారు.

## తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయాలి




**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్**

**ప్రభాతవార్త-సుబేదారి:**
తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. బుదవారం మండల నోడల్ అధికారులను, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని సూచన చేయడం జరిగింది. అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించినటువంటి లక్ష్య కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి ఎస్సెస్సీ ఫలితాలో జిల్లాను ముందంజలో ఉంచుటకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఆర్‌జెడి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠ సామార్ధ్యాన్ని పెంపొందించాలని దీనికి లైబ్రరీ పీరియడ్ సమర్ధవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ వరంగల్ సిపిడి సెల్‌కు చెందినటువంటి ఎస్ఆర్‌జిలు మదుసూదన్‌రెడ్డి, కే.సంపత్‌కుమార్. వి.శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## తాగునీటికోసం మహిళలపాట్లు

**తరిగొప్పుల, డిసెంబరు 6 ప్రభాతవార్త :**
మండలకేంద్రంలోని 2వ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్ కుళాయిలు నిర్మించి ఐదుసంవత్సరాలు గడుస్తున్నప్పటికీ తాగునీరు అందడంలేదని కాలనీ మహిళలు అంతర్గత రోడ్డుపై కాళిబిందెలతో బుధవారం నిరసన వ్యక్తంచేశారు. పలుమార్లు సమస్యను విన్నవించుకున్నా ఎవరూ పరిష్కరించక పోవడంతో చేసేదేమీ లేక కాలనీ వాసులు సొంతడబ్బులు వెచ్చించి బోరుబావి ఏర్పాటు చేసుకుని ఇన్నిరోజులు నీటిని ఉపయోగించుకున్నామని, ప్రస్తుతం బోరుబావు మరమ్మతులో నిలిచిపోగా తాగునీటికోసం అనేక పాట్లుపడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు స్పందించి పైపులైనకు గేట్‌వాల్వ్ ఏర్పాటు చేసి నీరు అందేవిధంగా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు బింగి విజయ, గాడి లావణ్య, మామిడాల రజిత, రమ, మచ్చ లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీ

**దేవరుప్పుల, డిసెంబరు 6 ప్రభాతవార్త :**
దేవరుప్పుల మండల లయన్స్‌క్లబ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మాధాపురం గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్, నోట్‌బుక్స్ పంపిణీచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు బేసిక్స్ నేర్పించడం ఉపాధ్యాయులు ప్రధానపాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మండలశాఖ సభ్యులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘననివాళి

**ఏటూరునాగారం రూరల్, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలో మండల అధ్యక్షులు చిటమట రఘు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మహాశయుని స్మరించుకుంటూ ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిటమట రఘు, వావిలాల ఎల్లయ్య మాట్లాడుతూ.. అభినవ మనువై బుద్ధుడి నుండి ప్రజ్ఞ, సమత, కరుణలను గ్రహించి, స్వేచ్ఛా, సమానత్వం, సోదరభావాలను రాజ్యాంగం ద్వారా అందించి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నియమాలు రూపొందించి, దేశసమగ్రతకు అన్ని వర్గాలు కలిసి భారతీయులై కృషి చేయాలని కోరిన అకుంఠిత దేశభక్తుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి ఘనమైన నివాళులు అర్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, టౌన్ అధ్యక్షులు ఎండి.సులేమాన్, టౌన్ ఉపాధ్యక్షులు మామిడి రాంబాబు, మాజీ టౌన్ అధ్యక్షులు తాళ్లపెల్లి నరేందర్, గికూరు భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**-పిఆర్‌టియు ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్**



కన్నాయిగూడెం ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ పత్రిక ప్రకటనలో తెలిపారు. అలాగే కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం(ఓపిఎస్)ను అమలు పరచాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డిఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీ 2023ను వెంటనే ప్రకటించి అమలు జరపాలని ప్రభుత్వానికి సూచించారు. 317 జీవో ద్వారా నష్టపోయి ఇతర జిల్లాలకు బదిలీలలో వెళ్లి ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సి బకాయిలు, మెడికల్ బిల్లులు, సరేండర్ బిల్లులు, జీపీఎఫ్ లోన్స్ విడుదల చేయాలని అన్నారు. అలాగే కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్న బదిలీలు, ప్రమోషన్‌లు చేపట్టాలని పాఠశాలలో స్కావెంజర్‌లను నియమించాలని, పాఠశాలకు ఉచిత కరెంటు సదుపాయం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడం కోసం విన్నూతమైన కార్యక్రమాలు అమలు చేసి, నూతన ప్రభుత్వానికీ ఉన్న అంకితభావన్ని తెలియజేయాలని, కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని కొనియాడారు.

# దివ్యాంగునిపై వ్యక్తి దాడి..

మల్హార్‌రావు, డిసెంబర్ 6, ప్రభాతవార్త



మండలకేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన అక్కపాక సమ్మయ్య అనే వ్యక్తి అక్రమంగా తన ఇంటిలోకి చొరబడి తనపై దాడి చేశాడని మల్క హరి అనే దివ్యాంగుడు ఆవేదన వ్యక్తం చేశాడు. జన్మత: ఎటు కదలలేని, నడవలేని స్థితిలో ఉన్న తనను విచక్షణారహితంగా దుర్భాషలాడుతూ దాడి చేశాడని, తీవ్ర గాయాలతో గోదావరిఖని ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. దీనిపై విచారణ జరిపించి తనకు న్యాయం జరిగేలా చూడాలని బాధితుడు అధికారులను వేడుకున్నాడు.

# మిగ్ జాం(మిచాంగ్)తో మండలంలో చిరుజల్లులు

**-తీవ్ర అవస్థలో వరి, పత్తి, మిర్చి రైతాంగం**

మల్హార్‌రావు, డిసెంబర్ 6, ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాన్ మిగ్‌జాం ప్రభావంతో మండల వ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. చల్లటి గాలుతో కూడిన చిరుజల్లులు కురవడంతో వరి, పత్తి, మిచ్చి రైతులకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోంటున్నారు. కోత దశలో ఉన్న వరి పంట వర్షం కారణంగా వరికోత యంత్రాలు నడిచే పరిస్థితి లేక వరికోతలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తుఫాన్ గాలులతో వరిపటం కిందపడడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటుగా పత్తిపంట వర్షానికి తడవడం వలన పత్తి నల్లబడి నాణ్యత తగ్గడంతో ధరపై ప్రభావం చూపుతుందని రైతులు తెలిపారు. తుఫాన్ మరో రెండు రోజులు కొనసాగే అవకాశ: ఉందని వాతావరణ కేంద్రాలు తెలియజేశాయి.

# గ్యాస్ సిలీండర్ పేలి ఇల్లు దగ్ధం

**-తప్పిన పెద్ద పెను ప్రమాదం..**

**-గుమ్మళ్లపల్లి గ్రామంలో సంఘటన**

కాటారం, డిసెంబర్ 6, ప్రభాతవార్త



గ్యాస్ సిలీండర్ పేలి ఇలులన దగ్ధమైన సంఘటన కాటారం మండలంలోని గుమ్మళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..గుమ్మళ్లపల్లి గ్రామానికి చెందిన సోయం మల్లయ్య ఇంట్లో గ్యాస్ లీకై సీలీండర్ పేలింది. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉంచుకున్న డబ్బులు, బంగారం, పత్తి, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా కానీ మంటలు ఆరకపోవడంతో ఇల్లు మొత్తం కాలి బూడిదైంది. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అధికారులు స్పందించి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందేవిధంగా చూడాలని స్థానిక సర్పంచ్ కంకణాల లత-బక్కిరెడ్డి, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# అంబేద్కర్ ఆశయాల్ని కొనసాగించాలి

చిట్యాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త

అంబేద్కర్ ఆశయాలని కొనసాగించాలని సాంఘీక సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కోండ భిక్షపతి, ఏవైఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్ల మల్లయ్యలు అన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..నిమ్నజాతి ప్రజల అభివృద్ధి కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కన్న కలలను సహకారం చేసేందుకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్వీట్లుచ పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవైఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య, మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు రాజేందర్, యుగేంధర్, కిరణ్, రాజేందర్, పాత్రికేయులు, విగ్రహ దాత కటుకూరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

**-కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**

కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, జిల్లా, మండల నాయకులు గుమ్మడి సత్యనారాయణ, దొడ్డి కిష్టయ్య, బుర్ర లక్ష్మణ్ గౌడ్, ఎంపిటీసీ దెబ్బేట అనిల్, మాజీ పిఏసిఎస్ వైస్ ఛైర్మన్ బుర్ర శ్రీనివాస్, గంగాధరి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**-ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నేరేళ్ల ఓదేలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



# అణచివేత అహంకారం వలనే బిఆర్ఎస్ ఓటమి

మల్హార్‌రావు, డిసెంబర్ 6, ప్రభాతవార్త



అణచివేత, అహంకారం వలనే బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి పాలైందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. గురువారం మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో పది సంవత్సరాల పాటు సాగిన నియంతృత్వ, కుటుంబ, అవినీతి పాలనకు ప్రజలు తమ ఓటుతో బిఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారని అన్నారు. ముఖ్యంగా ప్రశ్నించే గొంతుకలపై కొనసాగిస్తున్న అప్రకటిత నిషేధాన్ని, నిర్భందాన్ని కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. గత కేసిఆర్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆశలను, అకాంక్షలను నెరవేర్చడంలో గారాతి గోరంగా వైఫల్యం చెందిందని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్న నిరుద్యోగ యువతను ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించకుండా దారుణంగా మోసం చేశారని విమర్శించారు. తీవ్ర అసంతృప్తితో, ఆగ్రహంతో ఉన్న ప్రజలు ఈఎన్నికల్లో కేసిఆర్ ప్రభుత్వానిన ఓడించారని అన్నారు. ఇందుకుగాను తెలంగాణ ప్రజలకు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు అభినందనలు తెలియజేశారు. బిఆర్ఎస్‌తో పాటు మతోన్మాద ఫాసిస్ట్ బిజేపి పార్టీని కూడా ఓడించినందుకు మరోసారి రాష్ట్ర ప్రజలకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కామర గట్టయ్య, కర్ణాటక సమ్మయ్య, మారపల్లి మల్లేష్, దాసరి జనార్ధన్, నామాల శ్రీనివాస్, రాళ్లబండి శ్రీధర్, దేవేందర్, అక్కల బాపు తదితరులు పాల్గొన్నారు.

# సత్తన్న విజయంలో కార్యకర్తల కృషి గొప్పది..

**-పట్టణ అధ్యక్షులు క్యాతరాజు రమేష్**

మొగుళ్లపల్లి, డిసెంబర్ 6, ప్రభాతవార్త

భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణ రావు గెలుపులో మండల కార్యకర్తల కృషి గొప్పదని మొగుళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్ అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు అత్యధిక భారీ మెజార్టీతో గెలవడంతో ఆయనకు అభినందనలు తెలియజేశారు. గండ్ర సత్యనారాయణ రావు ప్రభుత్వ చీఫ్ విప్‌గా బాధ్యతలు చేపట్టాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలకు, బిఆర్ఎస్ పార్టీపై ఉన్న



వ్యతిరేకత తేటతెల్లం అయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజలందరికీ ఎంతో విశ్వాసం ఉందని, అందుకే రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని ఓడించి సాగనంపారని అన్నారు. మండలంలో గండ్ర సత్యనారాయణ రావును 4,628ఓట్ల మెజార్టీతో గెలిపించడంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల పటుట్టల గొప్పదని అన్నారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో మండలంలో అభివృద్ధి జరుగుతుందని, ఇచ్చిన హమీలను ఖచ్చితంగా ఆయన నెరవేరుస్తారని అన్నారు.

# కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

చిట్యాల, డిసెంబర్ 6, ప్రభాతవార్త

మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా అధికారులు బుధవారం సందర్శించారు. మండలంలోని దూతుపల్లి, ఒడితల, నవాబుపేట, గిద్దముత్తారం గ్రామాలలో జడ్పీ సిఈఓ విజయలక్ష్మి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వేర్వేరుగా సందర్శించారు. తుఫాన్ ప్రభావం ఉన్న నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రామయ్య, మార్కెట్ డైరెక్టర్‌లు, రైతులు ఉన్నారు.



# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కాటారం, డిసెంబర్ 6, ప్రభాతవార్త



కాటారం మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి రామకృష్ణ రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా భూపాలపల్లిలోని ఓప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కాగా రామకృష్ణ గత కొన్ని రోజుల నుండి అనారోగ్యం భారిన పడి చికిత్స పొందుతున్నాడని తెలిపారు. మృతుడు రామకృష్ణకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే రామకృష్ణ మృతితో బస్వాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.